నేటి దినపత్రిక
# సూర్య
శనివారం
2 మార్చి
2024
పేజీలు 8
అమరావతి
గుంటూరు, కృష్ణా

# పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్

## బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** అక్టోబరు – డిసెంబరు, 2023 త్రైమాసికానికి 9,44,666 మంది విద్యార్థులకు లబ్ది చేకూరుస్తూ.. రూ.708.68 కోట్లను ముఖ్యమంత్రి వైయస్.జగన్ కృష్ణా జిల్లా పామర్రులో బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ మీ చిక్కటి చిరునవ్వులు, చెరగని ప్రేమానారాగాల మధ్య దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలతో ఈరోజు మరో మంచి కార్యక్రమాన్ని పామర్రు నుంచి చేస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఇక్కడికి వచ్చిన ప్రతి అక్కకూ, ప్రతి చెల్లెమ్మకూ, ప్రతి అవ్వాతాతలకు, ప్రతిసోదరుడు, స్నేహితుడికి, చదువులు చదువుకుంటున్న నా చిట్టి చెల్లెల్లు, తమ్ముళ్లు అందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు. పిల్లలందరికీ నా అభినందనలు అన్నారు. పెద్ద చదువులు చదువుకుంటున్న పేదింటి పిల్లల వారి పూర్తి ఫీజులు, పూర్తి డబ్బు మొత్తాన్ని వంద శాతం ఫీజును ఆ పిల్లల తల్లులకే ఇచ్చి, తల్లులే ఆ ఫీజులు కాలేజీలకు కట్టే ఈ జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని గత 57 నెలలుగా క్రమం తప్పకుండా ప్రతి త్రైమాసికం అయిపోయిన వెంటనే ఆ తల్లులకు జమ చేస్తూ కొనసాగిస్తూ వచ్చాం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద చదువులు చదువుతున్న 9.45 లక్షల మంది పిల్లలకు.. అంటే పెద్ద చదువులు చదువుతున్న మొత్తం పిల్లల సంఖ్యలో ఏకంగా 93 శాతం మందికి జగనన్న విద్యా దీవెన ద్వారా మంచి చేస్తూ పిల్లల పూర్తి ఫీజును మీ జగనన్న ప్రభుత్వమే కడుతోంది అన్నారు. పిల్లలు ఇబ్బంది పడకూడదని ఏ త్రైమాసికం అయిపోయిన వెంటనే తల్లులకు ఫీజులు వేస్తూ కాలేజీల్లో ఫీజులు కట్టించే గొప్ప సంప్రదాయానికి నాంది పలికాం. పిల్లలకు పూర్తి ఫీజులు చెల్లించే విద్యాదీవనే కాకుండా పిల్లలు ఇబ్బంది పడకూడదని, జగనన్న వసతి దీవెన కార్యక్రమాన్ని తీసుకొచ్చి ప్రతి పాపకూ, బాబుకూ తల్లిదండ్రులకు మంచి చేసే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. 57 నెలలుగా జరిపిస్తున్నాం అన్నారు. ఈ 57 నెలల్లో మన విద్యావిధానంలో మీ అన్న ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేసిందో, దాని వల్ల ఎలాంటి ఫలితాలు రాబోతున్నాయో అన్నది ఒకసారి అందరూ గమనించమని కోరుతున్నాను అన్నారు.

**మన పిల్లలు ప్రపంచంతో పోటీపడతారు...**

మీ పిల్లల వయసు ఈరోజు మూడు సంవత్సరాలు కావొచ్చు, 3 సంవత్సరాల నుంచి 23 సంవత్సరాలలోపు ఎంతైనా కావచ్చు. వీరంతా కూడా శతమానం భవతి అన్న విధంగా కనీసం మరో 100 సంవత్సరాలు జీవించాల్సిన జనరేషన్‌లో ఉన్న వారు. ఏ విషయంలో అయినా కూడా వీళ్లందరూ పోటీ పడేది ఎవరితో అన్నది ప్రతి ఒక్కరం ఆలోచన చేయాలి. మిగతా 2లో



జగనన్న ప్రభుత్వంలో

## మహిళలే మహారాణులు

వివరాలు 2లో...

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

జిల్లాలో 99 పరీక్షా కేంద్రాల ద్వారా 39,544 విద్యార్థులకు గాను 38,822 మంది హాజరు : జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు 6



# ఘోర రోడ్డు ప్రమాదం

**ముగ్గురు మృతి**

**అతివేగమే కారణం...!**





**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్ :** గుంటూరు నగర శివారు ఏటుకూరు సమీపంలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కును ఢీ కొట్టింది. సంఘటనలో మూడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరొక ముగ్గురు తీవ్రగాయాలతో బయటపడ్డారు. మృతులు గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంత వాసులు. శుభకార్యం నుంచి సంతోషంగా ఇంటికి వెళ్లుతున్న ముగ్గురిని విధి రోడ్డు ప్రమాద రూపంలో కాటేసింది. గుంటూరు నగరంలోని ఏటుకూరు బైపాస్ సమీపంలో గురువారం అర్ధరాత్రి 12 గంటల 2



# పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్







(మొదటిపేజీ తరువాయి)

పోటీ పడేది రాబోయే రోజుల్లో ఈ గ్రామం ఆ గ్రామం, ఈ రాష్ట్రం ఆ రాష్ట్రం కాదు, దేశంతో కాదు, రేప్పొద్దున వీళ్లు ప్రపంచంతో పోటీ పడతారు అన్నారు.

**విద్యలో సమూల మార్పులు...**

ప్రాథమిక విద్యలో ప్రతి అడుగులోనూ మార్పులు తెచ్చాం. మనం వచ్చిన తర్వాతనే గవర్నమెంట్ బడులు మారాయి. ఇవాళ ఒకటో తరగతిలోమనం వేసే విత్తనం మరో 10-15 ఏళ్లలో చెట్టు అవుతుంది. మంచిభవిష్యత్ లేకపోతే చెట్టు ఒరిగిపోతుంది. అలా కాకుండా పిల్లలు పోటీ ప్రపంచంలో ఎదగాలి, పెరగాలి, భవిష్యత్తో అందరికన్నా మన పిల్లలు లీడర్లుగా ఎదగాలి అని అడుగులు వేస్తూ వచ్చాం. మార్పులుతీసుకొచ్చాం. నాడునేడుతో గవర్నమెంట్ బడులలో మార్పులు కనిపిస్తున్నాయి. ఇంగ్లీషు మీడియంతో పాటు గవర్నమెంట్ బడుల్లో సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం కనిపిస్తోంది.

**రూపురేఖలు మారిన 45 వేల స్కూళ్లు...**

మొట్ట మొదటిసారిగా నాడునేడుతో స్కూళ్లన్నీ రూపురేఖలు మారుస్తూ, 6వ తరగతి నుంచి ప్రతి క్లాస్ రూములో ఐఎఫ్ పీ ప్యానెల్స్ తీసుకొస్తూ అడుగులు పడింది కూడా ఈ 57 నెలల కాలంలోనే. పిల్లలను బడులకు పంపేలా ప్రోత్సహిస్తూ తల్లులకు ప్రతి సంవత్సరం రూ.15 వేలు ఇస్తున్నది కూడా ఈ 57 నెలల కాలంలోనే. నాడునేడులో భాగంగా 45 వేల స్కూళ్లలో రూపురేఖలు మారుస్తూ 12 రకాల అంశాలను తీసుకొని ప్రతి స్కూల్లో తీసుకొస్తూ అడుగులు పడింది కూడా ఈ 57 నెలల కాలంలోనే.



పిల్లలకు రోజుకో మెనూతో గోరుముద్ద అందిస్తున్నది కూడా ఈ 57 నెలల కాలంలోనే. ప్రతి మండలానికి కనీసం 2 జూనియర్ కాలేజీలుండాలని, అందులో ప్రత్యేకంగా ఆడపిల్లల కోసం ఒకటిఉండాలని ఏర్పాట్లు చేస్తున్నది కూడా ఈ 57 నెలల కాలంలోనే.

**ఐక్యరాజ్యసమితిలో మన ఆడపిల్లల ప్రసంగం...**

ఐక్య రాజ్యసమితిలో మన పేద ఆడ పిల్లలు అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడిన ఘట్టం పేద పిల్లల చరిత్రను మనందరి ప్రభుత్వం ఎంతగా మలుపులు తిప్పుతోందో



ప్రపంచానికి చాటి చెప్పిందో చూశాం. పెద్ద చదువులే చదువుతున్న పిల్లలకు మొట్ట మొదటి సారిగా 100 శాతం పూర్తిగా ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి కూడా కేవలం ఈ 57 నెలల కాలంలోనే. భోజన, వసతి ఖర్చులు కూడా భరిస్తున్న ప్రభుత్వం కూడా ఈ 57 నెలల కాలంలోనే.

**జగన్ అన్న వ్యక్తి పక్కకు పోతే...**

జగన్ అనే ఒక్కడు పక్కకు పోతే పిల్లల చదువులు ఉండవు, గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లీషు మీడియం ఉండదు, 100 శాతం ఫీజు రీయింబర్స్ మెంట్ కథ దేవుడెరుగు. విద్యారంగం గాలికిపోతుంది. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష, పేదవాడికి ఇంటికే మందులిస్తున్నది, వ్యవసాయం గాలికి ఎగిరిపోతుంది, రైతన్న పూర్తిగా చతికిలబడిపోతాడు, అక్కచెల్లెమ్మల బతుకులు చిన్నాభిన్నం అవుతాయి.

**కేవలం పేదవాడికి తోడుగా నిలబడుతూ..**

పేదవాడి భవిష్యత్ కోసం యుద్ధం చేస్తున్నది కేవలం మీ జగన్ మాత్రమే అన్నారు. అందుకనే ప్రతి ఒక్కరికీ చెబుతున్నాను. వాళ్లు చెప్పే అబద్ధాలు నమ్మకండి. మోసాలు నమ్మకండి. రాబోయే రోజుల్లో ఇంకా అబద్ధాలు, మోసాలు చెబుతారు. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారు కొనిస్తామంటారు. మీ ఇంట్లో మీ జగన్ వల్ల మంచి జరిగి ఉంటే మాత్రం మీ అన్నకు తోడుగా మీరే ప్రతిఒక్కరూ అడుగులు ముందుకు వేయండి, సైనికులుగా నిలబడండి. నేను చెప్పే ఈ మాటలు కచ్చితంగా గుర్తుపెట్టుకొండి. ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. దేవుడి దయ ప్రజలందరి చల్లని దీవెనలతో ఇంకా మంచి చేసే కార్యక్రమం గొప్పగా రావాలి, జరగాలని కోరుకుంటున్నాను అన్నారు. అనిల్‌ని చూసినప్పుడల్లా నాకు అనిపిస్తుంది... తన మాదిరిగా ప్రతి ఎమ్మెల్యే ఉంటే ప్రతి నియోజకవర్గానికి మంచి జరుగుతుంది. నిజాయితీ, నిబద్ధత ఉన్న మనిషి అనిల్‌ని మీరందరూ దీవించండి. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి కొన్ని పనులు అడిగాడు. అధికారులను పిలిపించి ఇవన్నీ కచ్చితంగా యుద్ధప్రాతిపదికన చేస్తాను అని చెబుతూ సీఎం వైయస్.జగన్ తన ప్రసంగం ముగించారు.



## ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ట్రాక్టర్ను కారు ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మృతులు గార్లపాటి సుబ్బమ్మ (45), గార్లపాటి పావని (18), గార్లపాటి శ్యామ్ దీక్షిత్(6)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన గార్లపాటి నాగలక్ష్మి, డ్రైవర్ శ్రీకాంత్కు జీజీహెచ్లో చికిత్స పొందుతున్నారు. రాధా అనే మహిళ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతులు, బాధితులంతా కూడా మంగళగిరికి చెందిన వారే. పిడుగురాళ్లలో వివాహానికి హాజరై తిరిగి ఇంటికి వస్తుండగా ఏటుకూరు బైపాస్ వద్ద ప్రమాదం జరిగింది. విషయం తెలిసిన వెంటనే సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించామని సౌత్ డీఎస్పీ విలేకరులకు తెలిపారు. నల్లపాడు స్టేషన్ సీఐ రాంబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## జగనన్న ప్రభుత్వంలో మహిళలే మహరాణులు

**పిల్లలను చదివించే తల్లులకు నగదు ప్రోత్సాహకం**

**మర్చి యార్డు కూలీలకు అండగా ఉంటాం**

**రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** మహిళలకు అన్నివిధాలా అండగా ఉంటూ వారిని ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళుతున్న గొప్ప ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. నరసరావుపేట రహదారిలోని కారం మిల్లులకు సంబంధించి ఎండు మిరప కాయల తొడాలు ఒలిచే కూలీలను మంత్రి విడదల రజిని శుక్రవారం ప్రత్యేకంగా కలుసుకున్నారు. వారితో కలిసి కూర్చుని కొద్దిసేపు తొడాలు ఒలిచారు. వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పనితీరు గురించి ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు బాగున్నాయా.. అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఏమైనా ఆశిస్తున్నారా..? అని మహిళలను ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడు తూ మహిళల ఆత్మ గౌరవం పెంచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. పిల్లలను చదివించుకునే పేద తల్లుల కు జగనన్న ఏటా రూ.15 వేలు అమ్మ ఒడి పథకం కింద అందిస్తున్నారని చెప్పారు. మన ఇబ్బందుల్లో, మన అవసరాల్లో మనకు పూర్తిగా అండగా ఉంటున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్ అని తెలిపారు. మహిళలకు ఏం కావాలన్నా ఇంకా మరింతగా సంక్షేమాన్ని అందించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

**జగనన్న మహిళా పక్షపాతి : మంత్రి రజిని**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళా పక్షపాతి అని, అందుకే అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు పెట్టి డబ్బులు నేరుగా వారి ఖాతాల్లోనే వేస్తున్నారని తెలిపారు. ఇళ్ల పట్టాలు కూడా మహిళల పేరు మీదే ఇస్తున్నారని, మహిళల రక్షణ కోసం దిశ యాప్ ప్రవేశపెట్టారని తెలిపారు. అంతేకాకుండా డ్వాక్రా మహిళలకు రుణాలపై వడ్డీ మాఫీ చేశారని, కొత్తగా రుణాలిచ్చి ప్రోత్సహిస్తున్నారని, మహిళా మార్టులు పెట్టి మహిళలను వ్యాపార వేత్తలుగా కూడా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. మహిళల కోసం ఇంత చేస్తున్న మన జగనన్నను గెలిపించుకుని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

**మిర్చి ఘాటును సైతం లెక్క చేయకుండా...**

మిర్చి కోరు, ఘాటును కూడా లెక్క చేయకుండా మంత్రి విడదల రజిని మిర్చి తొడాలు తీసే షెడ్లలో ఆ మహిళలతో కొద్ది సేపు తొడాలు ఒలిచారు. మిర్చి రాశుల మధ్య కూర్చుని దాదాపు గంట సమయం వరకు ముచ్చటించారు. కూలీలందరిలో తాను ఒకరిగా వారితో మమేకమై వారి సాధక బాధకాలను ఆలకించారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు ఆ మిర్చి కోరు మధ్యే తమ పిల్లలను చీరలతో ఉయ్యాలలు వేసి అక్కడే పడుకోబెట్టి సాకడం చూసి కలత చెందారు. ఆ బిడ్డలను చేతిలోకి తీసుకుని ముద్దాడారు. మంత్రి రజిని ఒక సామాన్యురాలిలా తమతో కలసిపోవడం చూసిన అక్కడి మహిళలంతా ఆనందంతో ఆమెకు జేజేలు పలికారు. తమ మద్దతు మీకే నంటూ జయజయధ్వానాలు చేశారు. మంత్రి వెంట ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, ఆయా క్లస్టర్ల ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**పథకం ద్వారా త్రైమాసికంలో 33,602 మందికి రూ. 31.72 కోట్ల లబ్ధి..**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు**




**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** విద్యకు పేదరికం అడ్డుకాకుడదన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా అందించే పూర్తి ఫీజు రీయంబర్సుమెంట్ తో ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి అనుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. 2023, అక్టోబర్-నవంబర్-డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణాజిల్లాలోని పామర్రులో శుక్రవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జగనన్న విద్యా దీవెన జిల్లాస్థాయి కార్యక్రమం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు, నగర్ మేయర్ రాయన బాగ్యలక్ష్మి, డిప్యూటి మేయర్లు, వివిధ కార్పోరేట్ చైర్మన్‌లతో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన చెక్కు అందజేశారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోను అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో నాడు-నేడు పథకాన్ని అమలు చేయడం ద్వారా పాఠశాలల రూపురేఖలనే మార్చివేయడం జరిగిందన్నారు. అత్యాధునిక మౌలిక వసతులను ఏర్పాటు చేసి ప్రాథమిక విద్య నుండే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మెరుగు పరచడం ద్వారా విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. నిరుపేద విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు పేదరికం అడ్డురాకూడదనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను అమలు చేయడం ద్వారా ప్రతీ పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఐటిఐ, డిప్లమా, డిగ్రీ ఆపై ఉన్నత విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థికి విద్యా దీవెన పథకం సువర్ణ అవకాశం లాంటిందన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో చదివే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విద్యా దీవెన పథకం ద్వారా ఫీజు రీయంబర్సుమెంట్‌ను నేరుగా తల్లుల ఖాతాలలో జమ చేస్తున్నామన్నారు. జిల్లాలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, బిఇడి, అగ్రికల్చర్, మెడికల్, నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న 37,178 మంది విద్యార్థులకు 31.72 కోట్ల రూపాయలను 33,602 మంది తల్లుల ఖాతాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారన్నారు. తల్లుల ఖాతాలలో జమ అయిన సొమ్మును వెంటనే కళాశాలలకు చెల్లించాలని తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ డిల్లీరావు సూచించారు.

కార్యక్రమంలో డిప్యూటి మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గా, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దీన్, భట్రాజ్ కార్పోరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి, జైన్ కార్పోరేషన్ చైర్మన్ మనోజ్ కోఠారి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ బి. వి.విజయభారతి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ కిరణ్మయి, డ్వామా పిడి జె. సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదులు



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం జరిగే డయల్ యువర్ పోలీస్ కమీషనర్ కార్యక్రమంను ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. ఇందుకోసం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 అనే నెంబర్ కు ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమీషనర్‌కి తెలియజేశారు. వీటిలో ట్రాఫిక్ సమస్యల గురించి, అసాంఘిక శక్తుల గురించి, కుటుంబ కలహాలుగురించి, ఆర్థికనేరాలు గురించి, స్థలం తగాదాల గురించి మొదలుగునవి మొత్తం 09 కాల్స్ చేయగా పోలీస్ కమీషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ యస్.హెచ్.ఓ.లతో, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించే దిశగా ఆదేశాలు జారి చేశారు. డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలకు సత్వర పరిష్కారం చేయుటకు, పోలిసుల పట్ల విశ్వాసాన్ని కల్పించుటకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని తెలియజేసారు.

# సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉన్నాం




**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక ఎన్ఫోర్సుమెంట్ ఏజెన్సీల నోడల్ అధికారుల నియామకం, జిల్లా కంట్రోల్ రూమ్, ఫిర్యాదుల నివేదిక తదితర అంశాలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక రూపొందించుకొని అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తుది ఓటర్ల జాబితా ప్రకటించిన నాటి నుండి నేటి వరకు నమోదైన అన్ని దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఉన్న 1,781 పోలింగ్ కేంద్రాలతో పాటు విజయవాడ రూరల్ మండలం లోని భాగమైన గన్నవరం నియోజకవర్గంలోని 82 పోలింగ్ కేంద్రాలతో కలిపి మొత్తంగా ఉన్న 1,863 పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఫర్నిచర్, లైటింగ్, ర్యాంప్, టాయిలెట్, త్రాగునీరు, తదితర మౌళిక వసతులను పరిశీలించి సిద్ధం చేస్తున్నామన్నారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ నాటి నుండి వివిధ వార్తా పత్రికలలో వచ్చిన ప్రతికూల వార్తల పరిష్కార నివేదికలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామన్నారు. బీఎల్వోలకు శిక్షణ పూర్తి చేశామన్నారు. ఎన్నికల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డిస్ట్రిక్ట్ కంట్రోల్ రూమ్ లో భాగంగా కంప్యూటర్లు, టీవీలు, స్కానర్లు, ప్రింటర్లు తదితర అన్ని సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి షెడ్యూల్ ప్రకారం శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ డిల్లీరావు ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో నగర పాలక సంస్థ మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి ఉన్నారు.



## ఎఫ్25 ప్రో ఆవిష్కరించిన ఒప్పో




**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఒప్పో ఇండియా ఎఫ్25 ప్రో 5జీని రెండు స్టోరేజ్ వేరియంట్‌లలో విడుదల చేసింది. వరుసగా రూ. 23,999 (128జీబీ), రూ. 25,999 (256జీబీ) వద్ద రిటైల్ చేయబడింది. ఈ స్మార్ట్‌ఫోన్ కొత్త లావా రెడ్ కలర్‌లో అందుబాటులో ఉంది. దీని ముందు, వెనుక షూటర్‌లలో 4కె వీడియో రికార్డింగ్‌తో 64 ఎంపీ వెనుక ట్రిపుల్ కెమెరా సెటప్, 6.7-అంగుళాల సరిహద్దులేని అమోఎల్‌ఈడీ డిస్‌ప్లే, వేగంగా ఛార్జింగ్ బ్యాటరీతో ఐపీ 65 రేటింగ్‌ను కలిగి ఉంది.

## రైతు భరోసా కేంద్రాలలో ముసాయిదా జాబితాలు ప్రదర్శన

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** రబీ సీజన్లో విత్తిన(నాటిన) పంటలను ఇ- క్రాఫ్‌లో నమోదు చేసి బయోమెట్రిక్ ధృవీకరణ పూర్తి అయిన ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తము రైతు భరోసా కేంద్రాలలో ఈ నెల 3వ తేదీ వరకు ప్రదర్శించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్. నాగమణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి జాబితాలోని పేర్లను రైతులకు చదివి వినిపించటం జరుగుతుందన్నారు. పంట నమోదు లో ఎటువంటి తప్పులను రైతులు గమనించిన లిఖిత పూర్వకంగా ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిశీలించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటామన్నారు.

కనుక ఈ సమయంలోనే రైతులు అప్రమత్తంగా ఉండి జాబితాలను పరిశీలించుకొని ఏవైనా తప్పులు దొర్లినట్లైతే దరఖాస్తు రూపంలో సంబంధిత గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల దృష్టికి తీసుకురావాలని రైతులను కోరుతున్నామన్నారు. నవీక రణ, దిద్దుబాటు చేసిన రికార్డ్స్ ను వీఆర్వో, విఏఏ, విహెచ్ఏ నిర్ధారణ, ఆమోదానికై మండల వ్యవసాయ అధికారికి, తహశీల్దార్ కు పంపడం జరు గుతుందని ఈ ప్రక్రియ ఈ నెల 5వతేది లోపు పూర్తి చేయడం జరుగుతుం దన్నారు. ఆమోదం పొందిన పిదప రబీ ఇ- క్రాప్ తుది జాబితా ఈ నెల 8వతేదిన అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుంద న్నారు. ఈ పంట నమోదు చేసుకొని, బయోమెట్రిక్ ధృవీకరణ చేసిన రైతు లకు మాత్రమే ప్రకృతి వైపరీత్యాలు, ఇతరత్రా కారణాలవలన జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం పొందేందుకు వీలుంటుందని వ్యవసాయ అధికారిణి నాగమణమ్మ ఆ ప్రకటనలో తెలిపారు.



## పకడ్బందీగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు

**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్ :** మండలంలో ని ఏడు కేంద్రాలైన మరియానివాస్, తేజ డి వి ఆర్, కె.వి.ఆర్, దీక్ష, సరస్వతి, చైతన్య, వెంకట సిద్ధార్థ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆయా కేంద్రాల్లో మొదటి రోజు ఇంటర్ పరీక్షలకు శుక్రవారం 2,261 విద్యార్థులకు గాను51 హాజరు కాలేదు, ఏడు కేంద్రాలకు పోలీసులు మహిళా పోలీసులు 51 మంది ఇన్విజిలేటర్లు తో పాటు పరీక్ష కేంద్రాలకు సీసీ కెమెరాలు నడుమ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి, ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా తాసిల్దార్ సరస్వతి పలు కళాశాల యాజమాన్యంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు, ఇటీవల డిగ్రీ పరీక్షల్లో ఒకకళాశాలలో మాస్ కాపీయింగ్ జరిగిన నేపథ్యంలో అలాంటి తప్పిదాలు జరగకుండా విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని మాస్కాపింగ్ కు ప్రోత్సహించిన పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా, స్క్వాడ్ ద్వారా ప్రత్యేక తనిఖీలు జరుగుతాయని తెలియజేశారు.

## ప్రజలు తెలుగుదేశం, జనసేన నాయకత్వాన్ని కోరుతున్నారు



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్:** పట్టణంలోని తొమ్మిదవ వార్డు ముక్కపాటి కాలనీలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ జెండా దిమ్మె ఆవిష్కరణ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన నేతలతో కలిసి తెలుగుదేశం జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జెండా దిమ్మె ఆవిష్కరణ ఒక పండగ వాతావరణంలా ఉంది.ముక్కపాటి కాలనీలో యువత ఉత్సాహం నిజంగా హర్షనీయం అన్నారు.గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో ఇళ్ళని ఇచ్చాము, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాం, లోన్లు అందించాము వాడ వాడలా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టాము.ఈ వైఎస్సార్ ప్రభుత్వంలో దళిత వర్గాలు మొత్తం దగాపడ్డాయి. సబ్సిడీ లోన్లు లేవు, అభివృద్ధి అటకెక్కింది, యువతకు ఉపాధి పూర్తిగా కుంటుపడింది.రానున్న తెలుగుదేశం జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో మళ్లీ రాష్ట్ర ప్రజానీకానికి మంచి రోజులు రానున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# లైంగిక కుటీరాలుగా మారుతున్న విద్యాలయాలు





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** విద్యా బుద్ధులు నేర్పించాల్సిన విద్యాలయాలు లైంగిక కుటీరాలుగా మారుతున్నాయని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్య నేర్పించాల్సిన ఆ వ్యవస్థలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు లైంగిక వేదింపులు అంటూ తరచూ వింటున్న ఘటనలు తల్లిదండ్రుల కంటి మమీద కునుకు లేకుండా చేస్తున్నాయని, ఈ విద్యా వ్యవస్థలో జరుగుతున్న సంఘటనలు ఆ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాలు సన్నగిల్లేలా చేస్తున్నా యని, ఇటివల ఎక్కువ శాతం మైనర్ బాలికలను వేదించిన కీచక ఉపాధ్యాయులు అనే వార్తలు ఎక్కువగా వెలు గులోనికి వస్తున్నాయ న్నారు. విద్యా బుద్ధులు చెప్పి విద్యార్థతలు వ్యక్తిత్వాన్ని పెంపొందించే క్యారెక్టర్ ప్రమాణికం కాకుండా విద్యను వ్యాపార సముదాయాలుగా భావించి నడిపిస్తున్న సంస్థల ప్రతినిధుల నిర్ణయాలే దీనికి ముఖ్య కారణం అన్నారు.

మానసిక, శారీరక రుగ్మతలను అధిగమించి విద్యను చెప్పే అధ్యాపక వ్యవస్థలో చిన్న, పెద్ద తేడా లేకుండా కీచక పర్వం పేరుతో వార్తలు వింటున్నాం అన్నారు. అసలు కులం, మతం లైంగిక కీచక పర్వం లేని విద్యాలయాలు చూడగలమా అనే సందేహం కల్గుతుందని, విద్యా వ్యవస్థలో వీటిపై ప్రక్షాలన జరగాలని లైంగిక దురాచారాలను రూపుమాపాలని అందు కోసం మన పరిధిలో ఏ తప్పు జరిగినా బాధితుల తరుపున న్యాయ పోరాటానికి సంఘం పరంగా నిలుస్తామని దోవా అన్నారు.

## ఆపదలో ఉన్న వారికి అండగా టీఎస్‌కె.నాయుడు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఆపదలో ఉన్న వారికి అండగా నేనున్నానంటూ నిరంతరం ప్రజా సేవలో తరిస్తున్న అవనిగడ్డ 6 వ వార్డుకు చెందిన శ్రీరామ వెల్ఫేర్ సోసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు నేనున్నానంటూ సింహాద్రి కాలనీలో నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందిచారు. అవనిగడ్డ సింహాద్రి కాలనీకి చెందిన ముళ్ళపుడి వెంకటేశ్వరరావు తన రెండు కిడ్నీలకు సమస్య రావడంతో హటాత్తుగా మరణించాడు. వెంకటేశ్వరరావు భార్య వెంకట నరసమ్మ వెన్ను సమస్యతో బాధపడుతూ ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కోంటున్న విషయం శ్యామ్ కిషోర్ నాయుడు దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన శ్యామ్ కిషోర్ నాయుడు శుక్రవారం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి తన వంతు సాయంగా 5 వేల రూపాయల నగదును వెంకట నరసమ్మకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ మాజీ వార్డు సభ్యులు దేగల రాఘవ, సొసైటీ సభ్యులు, తోట నరసింహానాయుడు, ముళ్ళపూడి నాగేశ్వరరావు, అల్లపర్తి గోపి, మోపిదేవి కోటేశ్వరరావు, సాయి ఫణీంద్రలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తుండటంతో వారికి ప్రైవేట్ క్లాసులు నిర్వహించడం విదితమే అయితే ఉదయం నుండి సాయంత్రం సాయంత్రం 5. 45 వరకు విద్యార్థులు పాఠశాలలో ఉండవలసి వస్తోంది ఇందుకోసం వారికి అల్పాహారంగా పోషక విలువలతో కూడుకున్న గోధుమ రవ్వ ఉప్మా ఒకరోజు సెనగల గుగ్గిలు మరొక రోజును సాయంత్రం వేళ అల్పాహారంగా విద్యా శాఖ వారు అందించారు. మండలంలో అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అల్పాహారాన్ని శుక్రవారం అందించారు గంగినేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జీవి రామకృష్ణ పాఠశాల కార్యదర్శి పి నాగరాజు విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు.

## సీపీఎస్ వెంటనే రద్దు చేయాలి




**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు, పెంక్షనర్లు, సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర అనాశక్తి కనబరుస్తుందని వెంటనే సి.పి.ఎస్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ పెడరేషన్ ఆద్వర్యంలో దర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెంక్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో ఆశక్తి చూపడం లేదని ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో పొందలేకపోతున్నారని మంజూరు చేయకపోగా మంజూరు అయిన వాటి బకాయిలు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని దాచుకున్న సొమ్ము అవసరం కొరకు వాడుకునే విషయంలో కూడా నిధులు మంజూరు చేయడంలో తీవ్రంగా కాలాయాపన జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ తాలుకా కేంద్రాల వద్ద దర్నా నిర్వహించి పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాలను సమర్పించారుఉ. వారి ప్రధాన డిమాండ్‌లు అయిన సి.పి.ఎస్.రద్దు చేయాలి, పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డిఎ లు తక్షణమే విడుదల చేయాలని 12వ పిఆర్‌సిలో మధ్యాంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలని, 11 వ పిఆర్‌సి బకాయిలు విడుతల వారిగా కాకుండా ఏకమొత్తంలో ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ పెడరేషన్ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## గుడివాడ తెలుగుదేశం పార్టీలో భారీగా చేరికలు



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ 17వ వార్డుకు చెందిన మరీదు రాహుల్ నేతృత్వంలో టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము సమక్షంలో 300మంది శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి వెనిగండ్ల రాము పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా 17వ వార్డు తెలుగుదేశం పార్టీ బాధ్యతలు మరిదు రాహుల్ కు అప్పగిస్తున్నట్లు వెనిగండ్ల రాము ప్రకటించారు. ప్రజాస్వామ్యవాదులందరూ ముందుకు వచ్చి టీడీపీకి మద్దతుగా నిలబడాలని రాము కోరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు, గుడివాడ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబుతో పాటు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సీనియర్ టీడీపీ నాయకులు డాక్టర్ ఉన్ గోర్జి సత్యనారాయణ, టీడీపీ నాయకులు గోకవరపు సునీల్, యార్లగడ్డ సుధారాణి, మరీదు విజయలక్ష్మి, పెద్దు వీరభద్రరావు, షేక్ జానీ,17వ వార్డు టీడీపీ నాయకులు బి భద్రాచలం, వెంకటేశ్వరరావు, ఎస్. కోటయ్య, ఉమా, ఎం ప్రభాకర్, ఎస్ అయ్యప్ప, ఎం కరుణ, ఎస్ మాత బాబు, అరుణ్ కుమార్, అశ్విని, ఎస్. రామకృష్ణ, మురళి, ఎం గాంధీ, పెద్ద సంఖ్యలో 17వ వార్డు ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిలువ గిరి మహోత్సవాలలో ఎమ్మెల్సీ అరుణ్ కుమార్






**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్:** పట్టణ శివారులో సిలువ గిరి పుణ్యక్షేత్ర మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాలలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పాల్గొన్నారు.సిలువ గిరి పుణ్యక్షేత్ర మహోత్సవాల నిర్వహణకు సొంత నిధులు రూ.50 వేలు విరాళంగా అందించిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. సిలువగిరిలో నీటి సమస్య ఉందని క్రైస్తవ సోదరులు తమ దృష్టికి తీసుకువచ్చారు. వారం రోజుల్లోపు నీటి సరఫరా కల్పించేలా చర్యలు చేపడతాం అన్నారు.

సిలువ గిరి మహోత్సవాలలో పాల్గొనడం ప్రభువైన ఏసుక్రీస్తు దీవెనగా భావిస్తున్నాను.. మా మాతృమూర్తి కస్తాల మరియమ్మ బైబిల్ చదువుతూ అందులోని దేవుడి వాక్యాలను మాకు చెబుతూ పెంచింది.. మా అమ్మగ ప్రార్థనల వలనే ఈ స్థాయిలో ఉన్నాము. సిలువ గిరి కొండపై గల చర్చి వరకు బీటీ రోడ్డు ఏర్పా టుకు చర్యలు చేపడతామన్న ఎమ్మెల్సీకి ప్రత్యేక కృతజ్ఞ తలు తెలిపి, శాలువాలతో మరియానివాస్ ఫాదర్లు, క్రైస్తవ పెద్దలు, క్రైస్తవ సోదరులు సత్కరించారు. ఆ దేవుడి దయతో ప్రజలకు చేయగలిగినంత మంచి చేస్తున్నాం మా పనితీరు నచ్చితేనే, మేము చేసిన అభివృద్ధి నచ్చితేనే.. ఆశీర్వదించమని కోరుతున్నాం.. ప్రజలకు ఇంకా మంచి చేయాలనే సంకల్పంతో ఉన్నాం.. రాజకీయాలు, ఓట్లు, పార్టీలు చూడకుండా ప్రతి ఒక్కరికి మంచి జరిగేలా పని చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రైస్తవ మత పెద్దలు, పలువురు పాస్టర్లు, పెద్ద ఎత్తున క్రైస్తవ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించండి



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం వారు తమ ఉత్తర్వులలో 2023-24ఆర్థిక సంవత్సరము యొక్క ఆస్థి పన్ను (భవనాలు, ఖాళీ స్థలం పన్నులు) ఏకమొత్తముగా అనగా ది.31.03.2024లోపు ఈ నెలాఖరు లోపు చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు కల్పించినది అని మున్సిపల్ కమిషనర్ హేమమాలిని శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ ఈ గొప్ప సదావకాశమును వినియోగించుకొని ది.31.03.2024 లోగా అనగా ఈ నెలాఖరులోగా ఆస్థి పన్ను (భవనాలు, ఖాళీ స్థలం పన్నులు) ఏకమొత్తముగా చెల్లించి వడ్డీ రాయితీ పొందవలసినదిగా తెలియజేయడమైనది. అదేవిధముగా నీటి కుళాయి పన్నులు కూడా చెల్లించవలసినదిగా కోరారు.ప్రభుత్వ శెలవు దినములలో కూడా నందిగామ పురపాలక సంఘ కార్యాలయములలో గల పురసేవ కౌంటర్‌లో అన్నిరకముల పన్నులు కట్టించుకొనబడును. పన్నులు కట్టించుకొను వేళలు ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9:00 వరకు, కావున పట్టణ ప్రజలు ఈ సువర్ణ అవకాశమును సద్వినియోగ పరుచుకొనవలసినదిగా కోరడమైనది.సకాలములో పన్నులు చెల్లించి నందిగామ పట్టణ అభివృద్ధికి సహకరించవలసినదిగా కోరారు.

## ముస్లింల వ్యతిరేకి వైసీపీ ప్రభుత్వం

**ఎన్టీఆర్ జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు "బాబు పే భరోసా" కరపత్రాల పంపిణీ**



**నందిగామ మార్చి 1 మేజర్ న్యూస్ :** తెలుగు దేశ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మైనార్టీ సంక్షేమ,అభివృద్ధి పథకాలను రద్దుచేసి ముస్లింలను వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ కరీముల్లా విమర్శించారు. శుక్రవారం స్థానిక చిన్న మసీదు వద్ద "బాబు పే భరోసా" కరపత్రాలను పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఇమామ్ జానీ తో కలిసి కరీముల్లా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కరిముల్లా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం మైనార్టీ సంక్షేమం కోసం,అభివృద్ధి కోసం కృషి చేసిందని వివరించారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం మైనార్టీ వర్గాలపై 70కి పైగా హత్యాదాడులు, ఆత్మహత్యలకు దారితీసే విధంగా హింసాత్మక సంఘటనలకు పాల్పడిందని వివరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ మైనార్టీ నాయకులు షేక్ హనీఫ్,హుస్సేన్ మహమ్మద్, షేక్ ఉద్దండు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుండి టీడీపీలోకి..



**కృత్తివెన్ను మార్చి1 మేజర్ న్యూస్ :** వైసిపి ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారని అందుకే తెలుగుదేశం, జనసేన పార్టీలో చేరికలు భారీగా పెరుగుతున్నాయని పెడన తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నపాండ్రాక పంచాయతీ పాశ్చాపురం దళితవాడలో 50 కుటుంబాల వారు సుమారు 100 మంది వైసీపీ నుండి జనసేన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే నిధులు ఇవ్వకుండా మళ్లించడమే కాకుండా ఎస్సీల పట్ల నిర్లక్ష్యం వహించడం చాలా బాధాకరంగా ఉందని అందుకే వైసీపీ పార్టీ ని విడిచి తెలుగుదేశం పార్టీలో చేరటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఒడుగు తులసి రావు జనసేన మండల పార్టీ అధ్యక్షులు పాశం నాగమల్లేశ్వరరావు,బంటుమిల్లి మండల పార్టీ అధ్యక్షుడు వీరబాబు, ఎం ఆంజనేయులు , మాజీ ఎంపీటీసీ పడవల రామకృష్ణ టీడీపీ నాయకులు పడమట మోహన్ రావు ,షాకీర్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరినవారు సుబ్రహ్మణ్యం, మరియదాసు ,,జి రాజు ,డి సాల్మన్ రాజు ,ముత్యాల ఆంజనేయులు, గొల్లపల్లి రాజు, మైనాబాతుల జ్ఞాన ప్రకాశరావు, కొనాల చిన్న వెంకటేశ్వరరావు, తంగిరాల వంశీ , దాసరి విక్టర్ బాబు, సోమల రాంబాబు, జల్లుల వెంకటేశు ,కనకవల్లి వెంకటేశ్వరరావు తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు.

## దళితుల పిలుపు.. తంగిరాల సౌమ్య గెలుపు



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్:** నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో దళితుల పిలుపు తంగిరాల సౌమ్య గెలుపు కార్యక్రమం జయంతి గ్రామంలో నిర్వహించారు. దళితుల మీద జరుగుతున్న దాడులు దళితులకు జరుగుతున్న అన్యాయాలు ప్రజలకి అర్థమయ్యే విధంగా కరపత్రాలు అందజేసి వివరించారు.దళిత మహిళ దళిత ఇంటి ఆడపడుచు తంగిరాల సౌమ్యకి ఈసారి ఎట్టి పరిస్థితుల్లో మేమందరము అండగా ఉంటామని జుజ్జురు గ్రామంలో ఉన్న దళిత ప్రజలు దళిత, మహిళలు ఘంటా పదంగా తెలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎస్సి అధ్యక్షులు వర్మ, నియో జకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు మార్కపుడి వర కుమార్ , సీనియర్ నాయకులు భరత్ రెడ్డి,బర్రె శంకరరావు లోకల్ దళిత నాయకులు పాల్గొన్నారు.

## ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రరావు



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్:** పట్టణంలోని రెవిన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు ఏ.రవీంద్ర రావు శుక్రవారం స్వీకరించారు. గతంలో నందిగామ ఆర్డీవోగా పని చేసినావు గతంలో నందిగామ ఆర్డీవో గా పనిచేసే ప్రజలను మన్నలను పొందారు. అనంతరం పలువురు రెవిన్యూ, శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్సీ అరుణ్‌ను కలిసిన ఆర్డీవో రవీంద్ర



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ గని నందిగామ రెవిన్యూ డివిజన్ ఆఫీసర్(ఆర్డీవో)గా బాధ్యతలు స్వీకరించిన ఏ. రవీంద్ర రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నందిగామ రెవిన్యూ డివిజన్ పరిధిలో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నందిగామ నియోజకవర్గం అభివృద్ధికి చొరవ చూపాలని సూచించారు. అనంతరం పలు విషయాలపై కొద్దిసేపు ఆయనతో చర్చించారు.

## ఆరోగ్యం బాగాలేక బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పామర్రులోని ఆరేపల్లి కళ్యాణ మండపంలో దివ్యాంగులు, వివిధ రకాల జబ్బులతో ఆరోగ్యం బాగాలేక బాధపడుతున్న వారికి జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, జిల్లా కలెక్టర్ రాజాబాబు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, మచిలీపట్నం, పామర్రు శాసనసభ్యులు పేర్ని నాని, కైలే అనిల్ కుమార్ ఆర్థిక సహాయం అందించారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణపనులకు శంకుస్థాపన



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** 40వ డివిజన్‌లో 50 లక్షలతో నాయి బ్రాహ్మణ సంఘ కమ్యూనిటీ హాల్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేసిన మచిలీపట్నం నియో జకవర్గ ఇంచార్జి పేర్ని కృష్ణమూర్తి. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, కార్పోరేటర్లు వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ



**గుడివాడ, మేజర్ న్యూస్:** బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పట్టణంలో కొనసాగుతుంది. ఈ కార్యక్రమం కింద 15, 19వార్డుల్లో టీడీపీ ఇన్చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రావి, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్ ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, జనసేన అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, పోలాసి ఉమామహేశ్వర రావు, పంచుమర్తి శ్రీనివాసరావు, రత్నకుమార్, శ్రీను, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు





**జిల్లాలో 99 పరీక్షా కేంద్రాల ద్వారా 39,544 విద్యార్థులకు గాను 38,822 మంది హాజరు**

**జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని తొలిరోజు మొదటి సంవత్సరం పరీక్షకు 99 కేంద్రాల ద్వారా 39,544 మంది విద్యార్థులకుగాను 38,822 మంది హాజరు కాగా 722 మంది గైరుహాజరైనట్లు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.

జిల్లాలో శుక్రవారం నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. నగరంలోని బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల, శ్రీ శారద కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి 39,544 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 38,822 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావడం జరిగిందన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పరీక్షలను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం గది లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించడం లేదన్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరీక్షించి మాల్ ప్రాక్టీస్ కు పాల్పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఒక్కొక్క పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపెరిండెంటెంట్, రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ లను, రెండు సిట్టింగ్ స్క్వాడ్ లను, 3 వేల 500 మంది ఇన్విజిలేటర్లను నియమించి పరీక్షలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో నిరంతరం విద్యుత్ సరఫరా, త్రాగు నీరు వంటి సౌకర్యాలను కల్పించామన్నారు. పరీక్ష హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఏపిఎస్ఆర్టిసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.



## పట్టణంలో ప్రారంభోత్సవాల సందడి

**31 వార్డులలో ఘనంగా ప్రారంభోత్సవాలు - ముఖ్య అతిథి గా హాజరైన సామినేని**

**జగ్గయ్యపేట టౌన్, మార్చి 1, మేజర్ న్యూస్:** పట్టణంలోని 31 వార్డులలో గడిచిన రెండేళ్లలో సుమారు 27 కోట్ల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పై పైన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను, యువనాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు ,ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని ఎక్కడా రాజీ పడకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీయం వై యస్ జగన్మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ళ సంక్షేమ పాలనలో జగ్గయ్యపేట పట్టణం లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా దాదాపు వంద కోట్ల మేర లబ్ది చేకూర్చామని తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం తదితర పనులతో పట్టణాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నామని చెప్పారు.

## సూర్యుడు పడమర ఉదయించిన సరే సీఎంగా జగనే ప్రమాణస్వీకారం చేస్తారు



**గుడివాడ, మేజర్ న్యూస్:** మే నెలాఖరున సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేయకుండా ఆపగలిగే మగాడు రాష్ట్రంలో లేడని ఎమ్మెల్యే కొడాలి నాని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై మాజీ మంత్రి కొడాలి నాని జోస్యం చెప్పారు.య చంద్రబాబు, పవన్, వదినమ్మ, చెల్లెమ్మ, మోడీ, సోనియా ఎంతమంది కలిసి వచ్చినా సరే సీఎం జగన్ ను అధికారం నుండి దింపగలిగే శక్తి సామర్థ్యాలు ఎవరికి లేవన్నారు. జగన్ సైకో అని ప్రతిపక్షాలు ఎలా అనగలుగుతున్నాయి. నవ్వుతూ జైలుకెళ్ళిన సీఎం జగన్ 16 నెలల తర్వాత కూడా అదే చిరునవ్వుతో బయటకు వచ్చాడన్నారు. జగన్ ముఖంలో నవ్వు తప్ప మరొకటి కనిపించదు. మాడు ముఖం, చించుకోవడం, ఫ్రస్టేషన్, గంతులు వేయడం ఇది ప్రతిపక్షాల తిరుగా ఎమ్మెల్యే చెప్పారు. 58 నెలల పాలనలో ఆర్థిక సమస్యలు తలెత్తిన కరోనా ఇబ్బందులు వచ్చిన ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా జగన్ పాలించాడు. అదే చంద్రబాబు అయితే ఇంట్లో పడుకొని కరోనా కష్టాలతో ప్రజలను పస్తులుంచేవాడని ఎమ్మెల్యే నాని విమర్శించారు.

# వెల్లంపల్లి, ఎంపీ నాని ప్రజాసంక్షేమం కోరే నాయకులు కాదు

**ప్రచార ఆర్భాటం మాత్రమే : టీడీపి నేత కేశినేని చిన్ని**



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** సెంట్రల్ నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయబోయే వెల్లంపల్లి శ్రీనివాస్ కు వ్యక్తిత్వమే కాదు,చాలా దారుణమైన చరిత్ర వుందని,పదవి కోసం నైతిక విలువల పక్కన పెట్టి, ప్రజల నమ్మకాన్ని తాకట్టు పెడతారని,ఇక ఇప్పుడు ఒకే గొడుగు కిందకి వచ్చిన వెల్లంపల్లి, ఎంపి నాని ప్రజాసంక్షేమం కోరే నాయకులు కాదని, ప్రచార ఆర్భాటం మాత్రమే కొరుకునే నాయకులని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) విమర్శనాస్త్రాలు సంధించారు. టీడీపీ,జనసేన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి, మాజీ శాసనసభ్యులు,బొండా ఉమా ఆధ్వర్యంలో శుక్రవారం సింగ్ నగర్ లోని రవీంద్ర కన్వెన్షన్ హాల్ లో సెంట్రల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరైన ఈ సమావేశానికి కేశినేని చిన్ని ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడాతూ 2009లో సెంట్రల్ నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన బోండా ఉమా సెంట్రల్ నియోజకవర్గాన్ని తెలుగుదేశం అడ్డా చేశారని, కమ్యూనిస్టులకు, కాంగ్రెస్ మంచి పట్టు వున్న ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని ఇంత బలోపేతం చేయటానికి బొండా ఉమా కృషి ఎంతో వుందన్నారు. తాను అధికారంలో వున్నా, లేకపోయినా ప్రజలకు,ప్రజల సమస్యల పట్ల, పార్టీకి అంకిత భావంతో పనిచేసిన నాయకుడు బొండా ఉమాన్న అని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఏ కార్యక్రమం కంగారు లేకుండా వస్తానని,ఎందుకంటే ఇక్కడ బొండా ఉమాన్న అన్ని దగ్గర వుండి చూసుకుంటారని,తనకి ఉమాన్న మధ్య ఎన్నో ఏళ్లుగా కుటుంబ సంబంధాలు వున్నాయన్నారు. బొండా ఉమాన్న తన సేవ, రాజకీయ కార్యక్రమాలకు అండదండగా ఎప్పుడు ప్రొత్సహిస్తుంటారని, బొండా ఉమా రాబోయే ఎన్నికల్లో భారీ మేజార్టీ గెలవాలని ఆకాంక్షించారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఉమా మీద,ప్రజల మీద నమ్మకం వుందని,అందుకే తను తిరువూరు నియోజకవర్గం పై ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. తిరువూరు, విజయవాడ వెస్ట్ లో టీడీపీ గెలిపించుకుంటే,ఎన్టీఆర్ జిల్లాలో తెలుగుదేశానికి ఎదురు వుండదన్నారు. అసెంబ్లీ లో అవమానానికి గురైన చంద్రబాబు ఈ కౌరవ సభకు సిఎం గా వస్తానని శపథం చేశారని,ఇందుకోసం ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు గెలిపించి, చంద్రబాబు కి కానుకగా ఇవ్వాలనన్నారు. రాష్ట్రంలోనే కాదు,సెంట్రల్ లో కూడా టీడీపీ గాలి బలంగా వుందని, అయితే నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా జాగ్రత్తగా వుండాలని సూచించారు. ఎన్నికలకు 50 రోజుల సమయం మాత్రమే వుందని, నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్ చార్జులు, డివిజన్ ప్రెసిడెంట్లు అందరూ సమాయత్తం కావాలన్నారు. వెస్ట్ లో వెల్లంపల్లి దారుణాలు,వారి సామాజిక వర్గానికి కూడా నచ్చలేదని, ఇప్పుడు వెస్ట్ నుంచి సెంట్రల్ కి జగన్ షిఫ్ట్ చేశాడని,గతంలో వెల్లంపల్లి పశ్చిమ నియోజకవర్గంలో పిఆర్పీ పార్టీ తరపున గెలిచాడని,ఆ తర్వాత 2014లో బీజేపీ తరుపున పోటీలో ఓడిపోయాడని తెలిపారు. ఆ తర్వాత బీజేపీ నుంచి వైసిపి కండువా కట్టుకుని ఎమ్మెల్యే అయ్యాడని, ఒక నైతికత లేని మనిషి, ప్రజల నమ్మకాన్ని తన పదవుల కోసం తాకట్టు పేట్టే నీచడని వెల్లంపల్లి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆలయంలో అవినీతి చేసిన వెల్లంపల్లి అమ్మవారితో పాటు,ప్రజలు బుద్ది చెప్పటానికి సంసిద్ధంగా వున్నారన్నారు. వెల్లంపల్లి లానే పిఆర్పీ నుంచి టీడీపీ కి వచ్చి,రెండు సార్లు ఎంపి గా గెలిచిన వ్యక్తి నాని,ఇప్పుడు సీటు రాదని తెలిసి వైసిపి వెళ్లాడని, చంద్రబాబు ని,లోకేష్ ని నమ్మించి కోవర్ట్ గా పనిచేసిన నీచుడని మండిపడ్డారు. సెంట్రల్ నియోజకవర్గంలో వైసిపిని ఘోరంగా ఓడించాలని, ఇందుకోసం టీడీపీ, జనసేన కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. బాబు అక్రమ అరెస్ట్ సమయంలో పవన్ కళ్యాన్ టీడీపీకి మద్దుతు ఇచ్చి,తెలుగు తమ్ముళ్ల గుండెల్లో నిలిచారని పేర్కొన్నారు.జనసేన కార్యకర్తలు,నాయకులు టీడీపీ అభ్యర్థులు వున్న చోట ఒక రెట్టింపు ఉత్సాహం పనిచేస్తే,జనసేన అభ్యర్థులు నిలబడిన చోట తెలుగు తమ్ముళ్లు రెండు రెట్లు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తారనన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఈ ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించా లన్నారు.అలాగే రాబోయేది టిడిప ప్రభుత్వంఅని,ప్రజా ప్రభుత్వం కాబట్టి,వాలంటీర్లు సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా పేదవారికి అందజేయాలని,అలా కాకుండా వ్యవహరిస్తే బొండా ఉమాన్న ఆ వాలంటీర్ల తాట తీస్తాడని శివనాథ్ హెచ్చరించారు.ఈ సమావేశంలో బొండా ఉమా మాట్లాడుతూ తన పై అవినీతి ఆరోపణలు చేసిన ఎంపి నాని,వాటిని నిరూపించా లని ఓపెన్ ఛాలెంజ్ చేశారు. లేకపోతే నాని అవినీతి, స్కాముల లెక్క ప్రజలకు, మీడియాకి వివరిస్తానని అన్నారు. 2 వేల కోట్లు పార్టీ కోసం ఖర్చు చేసినట్లు చెబుతున్న నానికి అంత సీన్ లేదని,ఎలక్షన్స్ అఫిడవిట్ లో 2014 లో 39 కోట్లు ఆస్తులని,66 కోట్లు అప్పులు వుండగా, 2019 లో 66 కోట్లు ఆస్తులు, 37 కోట్లు అప్పులు వున్నట్లు చూపించారని తెలిపారు. వెల్లంపల్లి , నాని ఇద్దరు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాలను గౌరవించి కలిసికట్టుగా పనిచేసి, సెంట్రల్ నియోజకవర్గం,విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని భారీ మేజార్టీతో గెలిపించుకోవా లన్నారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు బొండా ఉమాని, శివనాథ్ని గజమాల తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గంలోని డివిజన్ పార్టీ నాయకులు, కాపు నాయకులు, జనసేన నాయకులు, టీడీపీ అనుబంధ నాయకలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియపై కసరత్తు చేస్తున్న తెదేపా జనసేన

గుంటూరు, మేజర్ న్యూస్ : టిడిపి ఒక క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, నియోజకవర్గంలో ఎలాంటి సమస్య వచ్చినా తనకు, నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజా దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలను డాక్టర్ పెమ్మసాని కోరారు. తెనాలిలోని స్థానిక నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశానికి టిడిపి నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలకు మరో 50 రోజులే సమయం ఉన్నందున ప్రతి ఒక్క కార్యకర్త సమిష్టి కృషితో పనిచేయాలని కోరారు. త్వరలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పట్టణంలోని 40 డివిజన్లో పర్యటిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అలాగే నియోజకవర్గ టిడిపి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తాను ఒక్క తప్పు కూడా చేయనని, టిడిపి - జనసేన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ల నుంచి ఉన్న అశుభ్రమైన మురుగు శుభ్రత



తెనాలి,మేజర్ న్యూస్: స్థానిక 32వ వార్డు పరిధిలోని యడ్ల లింగయ్య వద్ద ఉన్న గుంటూరు రైల్వే ట్రాక్ కింద సుమారుగా 10 ఏళ్ల నుంచి పేరుకు పోయిన మురుగును మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక ఆధ్వర్యంలో కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి పర్యవేక్షణలో శుక్రవారం మున్సిపల్ అధికారులు గత మూడు రోజుల శుభ్రం చేయిస్తున్నారు. ఇటీవల పర్యటనలో భాగంగా స్థానికులు దృష్టికి తీసుకువచ్చారని చైర్మన్ రాధిక తెలిపారు. వెంటనే మున్సిపల్ అధికారులచే శుభ్రం చేయించామన్నారు. ఏమైనా సమస్యలుంటే దృష్టికి తేవాలని కౌన్సెలర్ సంధ్యారాణి సూచించారు. సమస్యను వెంటనే పరిష్కారానికి కృషి చేసిన చైర్మన్ రాధికరమేష్ కు,కౌన్సెలర్ సంధ్యారాణికి స్థానికులు ధన్యవాదాలు తెలియజేశారు. వారి వెంట వైసీపీ నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు, చెరుకుల సురేష్ రెడ్డి,విజయ్,కాలనీ వాసులు ఉన్నారు.

## ఆలపాటి ఆధ్వర్యంలో పింఛన్లు అందజేత



కొలకలూరు మేజర్ న్యూస్ : పింఛన్ అర్హత ఉన్న పింఛన్ పొందలేని రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన ఇటీవల మృతి చెందిన సుద్దపల్లి చంటి కుమార్తె మూగ బాలికకు,భర్తను కోల్పోయిన పాపబత్తిన వెంకాయమ్మకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం తెదేపా నాయకులు ఉన్నం అరుణకుమారి,సౌపాటి కోటేశ్వరి,ఆరంబాక నాగేశ్వరరావు,మోదుకూరి దావీదు ఒక్కొక్కరికి రూ.1500 పింఛన్ అందజేశారు.వైసీపీ ప్రభుత్వంలో నచ్చిన వారికి పంచన్లు ఇస్తున్నారని అర్హత ఉన్న పింఛన్ పొందకపోవడం బాధాకర మన్నారు. ఇలాంటి వారిని గుర్తించిన మా నాయకులు ఆలపాటి రాజేంద్రప్ర సాద్ నియోజకవర్గ స్థాయిలో ఇవ్వడం హర్షణీయమన్నారు .అధికారం ఉన్న లెక్కచేయని నాయకులెందరినో చూశామని కానీ అధికారం లేకపోయిన పేదలకు అండగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉంటున్నాడన్నారు. వారి వెంట గ్రామ తెదేపా నాయకులు ఉన్నారు.

## జడ్పీ హైస్కూల్లో పరీక్ష కేంద్రాల పరిశీలన



తెనాలిరూరల్,మేజర్ న్యూస్: ఈనెల 18న 10వ తరగతి పరీక్షలు జరుగనున్న నేపద్యంలో రూరల్ మండలంలోని కొలకలూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను రూరల్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. తరగతుల గదిగదికి తిరిగి తనిఖీ చేశారు. పరీక్షలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేలా పగడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తామని సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షలకు విద్యార్థులు సమయానికి హాజరవ్వాలన్నారు. విద్యార్థులకు త్రాగునీరు, తదితర సదుపాయాలు కల్పించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

## ఏసీబీ వలలో అవినీతి తిమింగలం



గుంటూరు క్రైం, మేజర్ న్యూస్: పూర్తి చేసిన పనులకు బిల్లు చేయడానికి లంచం తీసుకుంటూ పెదకాకాని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శివరామకృష్ణ శుక్రవారం రాత్రి ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు. పెదకాకాని ప్రాంతంలో రవి కిషోర్ రెడ్డి అనే కాంట్రాక్టర్ వివిధ అభివృద్ధి పనులు చేశాడు. పనుల నిమిత్తం అతనికి రూ.42 లక్షలకు బిల్లులు చేయాల్సి ఉంది. బిల్లులకు సంబంధించి ఎం-బుక్స్ ప్రిపేర్ చేయడానికి ఏఈ శివరామకృష్ణ భారీ మొత్తంలో నగదు డిమాండ్ చేశాడు. చేసేదిలేక కాంట్రాక్టర్ రవి కిషోర్ రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు సూచన మేరకు పథకం ప్రకారం రూ.1.68 లక్షలు నగదును గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏఈ కి అందించారు. అక్కడే వేచి ఉన్న ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. ఏసీబీ ఏఎస్పి మహేంద్ర మత్తే పర్యవేక్షణలో ఈ దాడులు జరిగాయి. దాడుల్లో డీఎస్పీలు ప్రతాప్ కుమార్, సత్యానందం, సిఐలు చింతా రవిబాబు, నాగరాజు, సురేష్ బాబు, అంజి బాబు, నరసింహారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



తెనాలి,మేజర్ న్యూస్: స్థానిక తెదేపా కార్యాలయంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన టీడిపి ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్,ఎమ్మెల్యే అభ్యర్థి టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైసీపీ ఎత్తులను చిత్తు చేసే విధంగా టీడీపీ, జన సైనికులు యుద్ధంలో పని చేసే సైనికుల వలె ఉండాలని ఏమాత్రం ఏమర పాటు వద్దని అదే సమయంలో వైసీపీ మన మధ్య ఎలాగైనా ఏదోక విధంగా వైరం కలిగే విధంగా ఎన్ని ప్రయత్నాలు చేసినా వాటిని ఎవరూ పరిగణలోనికి తీసుకోకూడదని భవిష్యత్తు మనదే అని మరి ముఖ్యంగా రాష్ట్ర భవిష్యత్ బాగు కోసం మనం నడుం బిగించాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెల్లువలా సంక్షేమ పథకాలు



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : నేను ఉన్నాను నేను విన్నాను అంటూ ప్రజా సంకల్ప యాత్రలో మాట ఇచ్చి నేటి వరకు సంక్షేమాలను పేద ప్రజలకు వెల్లువలా కురిపిస్తూ, సర్కారు అందించే సంక్షేమాలలో నన్ను భాగస్వాములను చేసి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమించినందుకు ఎంతో ఆనందంగా ఉందని బజరంగ్ ఫౌండేషన్ అధినేత అంబటి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన అడుగులలో అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్న నన్ను గమనించి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టడం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. పేదల బతుకులు బాగుండాలి ప్రతి ఇంటిలో వెలుగులు నింపాలి అన్న జగన్ ఆకాంక్షలను తూచా తప్పకుండా పాటించి ఆయన మన్ననలకు ఇంకా చేరువవు తానని తెలిపారు ఇందులో భాగంగా ఫిబ్రవరి 25న చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో జరిగిన బజరంగ్ సంక్షేమ సంగమం' కార్యక్రమంలో భాగంగా జరిగిన బజరంగ్ 'నేత్రజ్యోతి' శిబిరంలో పాల్గొన్నటువంటి గ్రామస్తులకు 888 మందికి వ్యక్తిగత కళ్ళ జోళ్ళు అవసరమని డాక్టర్లు నిర్ధారించగా వాటిని ఈ రోజు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు వ్యక్తిగత కళ్ళజోళ్ళు ధరించి స్పష్టమైన దృష్టితో సంక్షేమ సారధి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాన్ని చూసి భావోద్వేగానికి గురి కావడం గమనార్హం. సంక్షేమ సారధి ముఖ్యమంత్రి కి పేదల పట్ల ఉన్నటువంటి శ్రద్ధను విస్తృతస్థాయిలో ప్రజానీకంలోకి తీసుకు వెళ్లాలని బజరంగ్ ఫౌండేషన్ నిర్ణయించినట్లు అంబటి మురళీకృష్ణ తెలియ జేశారు. నేత్ర సమస్యలతో బాధపడేవారికి ఊరట కలిగించి, వారి చీకట్లను పారద్రోలి, తిరిగి వెలుగులను ప్రసాదించే కార్యక్రమంగా బజరంగ్ నేత్ర జ్యోతి గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పనిచేస్తోందన్నారు. బజరంగ్ సామాజిక సేవా విభాగ బృందం సభ్యులు కళ్ళజోళ్ళ ఆవశ్యకత ఉన్న వారిని ఈ కార్యక్రమానికి సాదరంగా ఆహ్వానించి, వారంతా కళ్ళజోళ్ళు పొందడానికి వారి వెన్నంటే ఉండి సహకరించారు. 888 మందికి ఈ కార్యక్రమంలో కళ్ళ జోళ్ళను అందజేశారు. 'జగనన్న సంక్షేమ పాలన' ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. పెక్కు గ్రామాలలో నిర్వహించిన ఈ సంక్షేమ సంగమ శిబిరాలకు అనూహ్య రీతిలో స్పందన లభించిందని వివరించారు. ఈ సేవా పరంపర యొక్క సత్ఫలితాలను గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు అంకితం చేస్తూ కొనసాగించడం జరుగుతుందని తెలిపారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



గుంటూరు, మేజర్ న్యూస్ : స్థానిక ఏ. సి కాలేజీ లో జరుగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల తీరు తెన్నులను జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పరీక్షల్లో ఎలాంటి మాల ప్రాక్టీస్ జరగకుండా నిశితంగా పరిశీలించేందుకు ప్రిన్సిపల్ ఛాంబర్ నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పరీక్ష హాల్స్ ను వీక్షించారు. అనంతరం జిల్లాలో 92 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలను రీజనల్ ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లైవ్ వివ్యూ లో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పరీక్షలు అయ్యే వరకు చక్కగా ఏర్పాటు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు రీజనల్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్ జి. కె.జుబేర్ కు జిల్లా కలెక్టర్ సూచించారు. పరీక్షల అనంతరం ఆన్సర్ షీట్ల ను జాగ్రత్తగా భద్రపరచి ప్రభుత్వం సూచించిన జిల్లాలకు వాటిని చేరవేసేందుకు పరిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు సజావుగా ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఈ రోజు జిల్లాలోని 92 పరీక్ష కేంద్రాల్లో రెండవ లాంగ్వేజి తెలుగు, ఉర్దూ , హిందీ , సంస్కృతం పరీక్షలకు 32,498 మంది హాజరు కావలసి వుండగా , 31,718 మంది హాజరయ్యారు . 780 మంది గైరు హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. పరిశీలన కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ నగేష్ , ఇంటర్మీడియట్ అధికారులు పాల్గొన్నారు.

# ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 10న బాలోత్సవ్ భవన్లో జరిగే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్ను శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆవిష్కరించారు. మహిళాదినోత్సవం సందర్భంగా వారిలో ఉండే టాలెంట్ ను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. మహిళా సమానత్వం సాధించిన నాడే దేశం ముందుకు పోతుందని, ఇలాంటి మంచి కార్యక్రమాల ద్వారా మహిళల్లో దాగివున్న ప్రజ్ఞ ప్రపంచానికి తెలుస్తుందని కలెక్టర్ అన్నారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం మహిళా విభాగాల ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్ జరుగుతోందని నిర్వాహకలు ఎ. సంధ్యారాణి, కె. స్వరూపరాణి, జి. జ్యోత్స్న తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బాలోత్సవ భవన్లో ఎగ్జిబిషన్ ప్రారంభం అవుతుందని, మధ్యాహ్నం 3.30 గంటలకు బెస్ట్ ఫ్రం వేస్ట్ క్రాఫ్ట్ డెమో కార్యక్రమాన్ని స్వాతి పూర్ణిమ, పేపర్ క్విల్లింగ్ కార్యక్రమాన్ని మేడా రజని ప్రారంభిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, అతిధుల ప్రసంగాలు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహుకులు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఫోరంఫర్ ఆర్టిస్ట్ అధ్యక్షులు ఎ. సునీల్ కుమార్, ప్రియాంక, లలితా సౌజన్య, సేఫ్ ప్రెసిడెంట్ జి. జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



## ఉమ్రా యాత్రికులతో కలిసి ప్రార్ధనలో దేవినేని ఉమా

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావుకార్యాలయం శుక్రవారం కొండపల్లి మున్సిపాలిటీ నుండి ముస్లింలు ఉమ్రా యాత్రకు (సౌదీ అరేబియాలోని మక్కా మదీనా) బయలుదేరారు. ఈ సందర్భంగా వారితో కలిసి టీడీపీ నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, మోమమ్మద్ ఫైజ్ఖాన్ ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ వీరంతా ముస్లింల పవిత్ర స్ధలం మక్కా, మదీనాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిస్తారని తెలిపారు. మొహమ్మద్ జైనుల్లాబుద్దీన్ (అప్సర్), ఫర్హాన్ వారి యాత్ర సజావుగా, సాగాలని సంతోషంగా తిరిగి రావాలని, వారి కుటుంబంతో పాటు అందరీ ఆశీస్సులు ఉండాలనని, మన ప్రాంతమంతా సస్యశ్యామలంగా, సుఖ సంతోషాలతో, పాడి పంటలతో కళకళలాడాలని అక్కడ ప్రార్ధనలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నేతలు షేక్ కరీముల్లా, ఫైజాన్, షేక్ జిలాని, షేక్ సమీవుల్లా, ఇబ్రహీం, జిలానీ, షేక్ సర్వర్ సాహెబ్ (గోరే), పార్టీ నేతలు చుట్టుకుదురు వాసు, దొడ్డాకుల వెంకటేశ్వరరావు, ముద్దంగుల సాంబమూర్తి, నీలం జాన్ బాబు, మేడ శ్రీనివాసరావు, కొరట శ్రీనివాసరాజు, పాలపర్తి నాగేశ్వరావు, నిమ్మల నాగరాజు, రాగ జమలయ్య, కంప కోటేశ్వరరావు, దుస్సా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కటికల కుటుంబ సభ్యులకు మండలి పరామర్శ

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కటికల కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. మండల పరిధిలోని అశ్వరావుపాలెం గ్రామంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కటికల వెంకట సుబ్బమ్మ ఇటివల అకాల మరణం చెందడంతో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు మండలి వెంకట్రామ్ కుటుంబ సభ్యులను పరామర్శించి వెంకట సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంద్రాజు నాగ వెంకట లంకమ్మ ప్రసాద్, దాసినేని మురళి, బచ్చు రఘునాథ్, కొండవీటి పాండు రంగారావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో బీజేపీ పోటీ చేయాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ పోటీ చేయించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి వినతి పత్రం అందచేశారు. శుక్రవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర బీజేపీ కౌలు రైతుల కన్వినర్ జివి నగరాయులు, బీజేపీ సీనియర్ నాయకులు భోగాది చంద్రశేఖర్, నియోజకవర్గ కౌలు రైతుల కన్వినర్ భూపతి సుబ్రహ్మణ్యంలు ఇచ్చిన వినతి పత్రంలో పలు విషయాలు పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ ఆద్వర్యంలో పులిగడ్డ పెనుమూడి వారధి, జాతీయ రహదారి, సముద్రపు కరకట్టలు, సాగునీటి కొరకు ఉద్యమాలు చేసిన తీరు అనేక సమస్యలపై బీజేపీ అనుబంధ సమస్థలచే ప్రయత్నాలు చేసి ఏ రాజకీయ పార్టీలు చేయని విధంగా అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని, ఈ విధంగా ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ నాయకులు చేయలేదని ఒక్కసారి నియోజకవర్గ ప్రజలు ఆలోచించి ఆంధ్రాలో కులాల ఆధారంగా జరిగే రాజకీయాల కారణంగా దేశాభిమానం ఏర్పడని కారణంతో నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ తగినంత బలం పుంజుకోలేదని ప్రజలు దేశాన్ని ప్రేమించడం మొదలు పెట్టి నరేంద్ర మోడీ న్యాయకత్వంలో చేస్తున్న ప్రయత్నాలు గమనిస్తే , భారతీయ జనతా పార్టీ ప్రభంజనం రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ఉందని, విజ్ఞులు అయిన దివిసీమ ప్రజలు, పెద్దలు, రాజకీయ నాయకులు ఏ విధంగా ఉన్నాయి, ఎవరు సమస్యలపై పోరాటం చేసి ప్రజలకు అందుబాటులో ఉంటారు అనేది ఆలోచనలో ఉన్నారని బీజేపీ ఎన్నికలకు సంసిద్ధం అని బీజేపీ రాష్ట్ర న్యాయకత్వానికి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

## సీఎం వైయస్ జగన్ ను కలిసిన ఎమ్మెల్సీ అరుణ్



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్:** కృష్ణాజిల్లా పామర్రులో నిర్వహించిన జగనన్న విద్యా దీవెన పథకం నిధుల విడుదల కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి ఆత్మీయ స్వాగతం శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పలికారు. అనంతరం సీఎంకు మర్యాద పూర్వకంగా ఎమ్మెల్సీ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆత్మీయంగా పలకరించి కొద్దిసేపు ముచ్చటించారు.

# టీడీపీ ప్రభుత్వంలోనే మహిళా సాధికారత




**గన్నవరం, మార్చి 1, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మహిళా సాధికారత వెల్లివిరిసిందని గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్ధి యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలోని ఏబీ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం ఉదయం తెలుగు మహిళ ఆధ్వర్యంలో మీతో మీ నాయకుడు చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ మహిళలనుద్దేశించి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయని, దేశం మొత్తం మీద చుస్తే మన రాష్ట్రంలోనే మహిళలపై ఎక్కువ దాడులు జరగటం సిగ్గుచేటు అన్నారు. ప్రతిరోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు భద్రత కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మహిళల కోసం ప్రత్యేక చట్టాలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలను ప్రవేశపెట్టి మహిళల ఆర్ధికంగా బలోపేతం అయ్యేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేశారని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పథకాలు రూపొందించారని గుర్తు చేశారు. మహిళలకు రుణ వసతి కల్పించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు.మహిళల ఆర్థిక స్వాలంబనకు తెలుగు తెలుగుదేశం ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. విద్యార్థినిలను ఐటీ వైపు ప్రోత్సహించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా సాఫ్ట్వేర్ రంగంలో రాణిస్తున్నారని విదేశాల్లో సైతం పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తూ తమకాళ్లపై తమ నిలబడటమే కాకుండా కుటుంబానికి, దేశాభివృద్ధికి సహకరిస్తున్నారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో మహిళలు అంతా తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉండి చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి పరంగా వెనుకబడిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే సత్తా చంద్రబాబు నాయుడుకి మాత్రమే ఉందని ఆయన పేర్కొన్నారు. విభజన కారణంగా నష్టపోయిన రాష్ట్రాన్ని ఐదేళ్లలో అభివృద్ధి పదంలో నిలబెట్టారని గుర్తుచేశారు. ఇటీవల కాలంలో గన్నవరం నియోజకవర్గంలో అరాచకశక్తుల ఆగడాల అధికమయ్యాయని వీటిని అరికట్టి ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గన్నవరంలో టీడీపీ ఆఫీసును ద్వాంసం చేయటమే కాకుండా టీడీపీ శ్రేణుల పైన అమాయ కుల పైన అక్రమ కేసులు పెట్టి ఈ ప్రభుత్వం వేధింపులు గురిచేసిందని, లోకేష్ పాదయాత్ర సందర్భంగా రంగన్న గూడెం గ్రామంలో అక్రమ కేసులతో తెలుగుదేశం నాయకులను కార్యక ర్తలను తీవ్ర ఇబ్బందులు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు అందరూ ముందుకురావాలని కోరారు. తనకు ఒక అవకాశం ఇస్తే గన్నవరంలో పూర్వపు ప్రశాంత వాతావరణ నెలకొల్పి అరాచక శక్తులు ఆగడాల అరికడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ ముల్పూరి సాయి కళ్యాణి, మండవ లక్ష్మి, చిక్కవరపు నాగమణి, మండవ రమ్య, గరికిపాటి నాగా లక్ష్మి, పొదిలి లలిత, కంబంపాటి లక్ష్మి, బస్సే సరిత, గుజ్జరలపూడి అజిత, కోనేరు రమమణి, చట్టు నాగమణి, వెంకటేశ్వరమ్మ, సుభాషిణి, క్రాంతి, మల్లేశ్వరీ, రాధికా, శాంతమ్మా, వెంకట దుర్గ, సులోచన, దామాయతి,గుద్దేటి సుమతి, పొట్లూరి జ్యోతి, బేతల ప్రమీలరని, వల్లభనేని నాగమణి, చిన్నం శ్రీదేవి, వడ్డీల్లి లక్ష్మి, అదేవిధంగా గన్నవరం నియోజకవర్గ జనసేన వీరమహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రూరల్ మండల మహిళా అధ్యక్షురాలు మేకల స్వతి, సంధ్య,పుణ్యవతి, సగరబోయిన శుభాషిణి, చింతగాళ్ళు కుమారి, దుంపల సంధ్యరాణి, తిరుమారెడ్డి సంతోషకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ వైసిపి అధ్యక్షుడు సురేష్ జన్మదిన వేడుకలు



తుళ్లూరు మేజర్ న్యూస్ : రాజధాని ప్రాంతమైన మండల కేంద్రం తుళ్లూరు గ్రామ వైసిపి అధ్యక్షుడు ఆలోకం సురేష్ 53వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు శుక్రవారం తుళ్లూరు వైసిపి పార్టీ కార్యాలయంలో జరిగిన సురేష్ జన్మదిన వేడుకలకు మాజీ హోం మంత్రి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత హాజరయ్యారు ఈ సందర్భంగా కేకును కట్ చేసి సురేష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు ఆమె తెలియజేశారు ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు సురేష్ కష్టపడుతూ ఉంటాడు అన్నారు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు సురేష్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆమె దీవించారు సురేష్ జన్మదిన వేడుకల్లో పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఓటు ప్రాముఖ్యతపై అవగాహన




దుగ్గిరాల, మేజర్ న్యూస్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ ఎన్నికల శంకరావంలో మొట్టమొదటిగా ఓటు హక్కు వినియోగించు కోబోయే యువతీ యువకులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై చింతలపూడి గ్రామంలోనీ. ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో. శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేశంనేని శ్రీ అనిత ఆకుల జైసత్య, జంగాల చైతన్య ,పడవల మహేష్ ,తదితరులు ఓటు ఎందుకు వేయాలి, ఎవరికి వేయాలి, ఎలా వేయాలి తదితర అంశాలపై. వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం. అశోక్, ఎస్. లీలా కృష్ణ ,బి .సాయి అరవింద్ , ఉన్నం ఝాన్సీ రాణి ,టి ,. భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెనాలిని ప్రమాద రహితంగా తీర్చిదిద్దండి

### తెనాలి మోటారు వెహికల్ తనిఖీ అధికారి రాఘవరావు



తెనాలి,మేజర్ న్యూస్: రహదారి భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని మోటారు వెహికల్ తనిఖీ అధికారి తోట.రాఘవరావు పేర్కొన్నారు.ఆయన శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద వాహనదారులతో మాట్లాడారు.వాహనాలు నడిపే ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని,మీకోసం ఇంటి వద్ద కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారని తెలిపారు.అదేవిధంగా హెల్మెట్ తో పాటు పొల్యూషన్, ఇన్సూరెన్స్ ,డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.ఇన్సూరెన్స్ ఉంటే ప్రమాదాలు జరిగిన బాధిత కుటుంబానికి ఆర్థికభరోసా ఉంటుందన్నారు.డ్రైవింగ్ లైసెన్స్ కి రూ.5 వేలు,హెల్మెట్ కి రూ.1000,పొల్యూషన్ కి రూ.1500,ఇన్సూరెన్స్ కి రూ.2 వేలు చలనాలున్నాయన్నారు.అదేవిధంగా తల్లిదండ్రులు మైనర్ బాలబాలికలకు వాహనాలు ఇవ్వొద్దని లేదంటే తల్లిదండ్రులపై కేసులు నమోదవుతున్నారు.18 ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరు లైసెన్స్ కి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.తెనాలిని ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని సూచించారు.ఆయన వెంట అసిస్టెంట్ మోటారు వెహికల్ తనిఖీ అధికారి మధుసూధనరావు ఉన్నారు.

# పరిశ్రమల స్థాపన పై విద్యార్థులు దృష్టి సారించాలి

గుంటూరు రూరల్, మేజర్ న్యూస్: ప్రతి విద్యార్థి అంకుర పరిశ్రమల స్థాపన దిశగా ఆలోచనలు చేస్తూ, అందుకు అనుగుణంగా నైపుణ్యానికి వృద్ధి చేసుకుంటూ, పరిశోధనలకు అనువైన ఆర్ వి ఆర్ %డ% జె సి ఇంక్యుబేటర్ సెంటర్ సద్వినియోగం చుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ ఇంక్యుబేషన్ కౌన్సిల్ సి ఈ ఓ %డ% డైరెక్టర్ రవి ఈశ్వరపు పేర్కొన్నారు. స్థానిక చౌడవరం లోని ఆర్ వి ఆర్ , జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈ డి సెల్, ఐ ఐ సి సెల్ ఆధ్వర్యంలో కళాశాల ఆర్ జె ఈ –నెస్ట్ సహకారంతో రెండు విభాగాలుగా వర్క్ షాప్ లను నిర్వహించారు. " ఎచీవింగ్ ప్రాబ్లెమ్ – సొల్యూషన్ ఫిట్, ప్రొడక్ట్ – మార్కెట్ ఫిట్ " అనే అంశం పై నిర్వహించిన వర్క్ షాప్ కు ఆంధ్రా యూనివర్సిటీ ఇంక్యుబేషన్ కౌన్సిల్ సి ఈ ఓ %డ% డైరెక్టర్ రవి ఈశ్వరపు మరియు "ఎంటర్ ప్రెన్యూర్ స్కిల్, ఆటిట్యూడ్ %డ% బిహేవియర్ డెవలప్మెంట్" అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్కు ఆంధ్రా యూనివర్సిటీ



ఇంక్యుబేషన్ కౌన్సిల్ మేనేజర్ దినకర్ వాడపల్లి అథిధులుగా విచ్చేశారు. విద్యార్థులకు నూతన అంకుర పరిశ్రమల స్థాపనకు, అది విజయపథం లో నడపబడటానికి చేపట్టవలసిన చర్యలను, అందులోని వివిధ దశలను వివరించి, పరిశ్రమల్లో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించే సులభతర మార్గాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఆర్ వి ఆర్ %డ% జె.సి. ఇంజనీరింగ్ కళాశాలను "స్టార్ట్ అప్ హబ్ " గా నెలకొల్పడమే తమ లక్ష్యమని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. తమ కళాశాలలో నూతనంగా నెలకొల్పిన ఇంక్యుబేటర్ సెంటర్ను తోడ్పాటు అందించేందుకు కావలిసిన న్యూ స్టార్ట్ అప్ శిక్షణను అందించేందుకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంక్యుబేషన్ కౌన్సిల్ నిపుణులు ముందుకు రావడం ఆనందదాయకమని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ ,కళాశాల ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్%డ%డి డైరెక్టర్ డా: కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, కళాశాల ఐ ఐ సి కన్వీనర్ డా: నాగమల్లేశ్వర రావు, కళాశాల ఐ టి బి ఐ కో ఆర్డి నేటర్ డా: ఎమ్ వి పి చంద్ర శేఖర్ తదితరు లున్నారు.

# ఎమ్మెల్యే కిలారిపై టిడిపి నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం

పెదకాకాని మేజర్ న్యూస్ : పెదకాకాని మండల పరిధిలోని అనమర్లపూడి గ్రామ భూములపై తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదని పెదకాకాని మండల పరిషత్ అధ్యక్షులు తుళ్ళి మిల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు శుక్రవారం పెదకాకానిలోని వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వేనెంబర్ 56 లోని భూములపై 1973 నుండి వివాదాలు ఉన్నాయని వాటికి సం బంధించి ఇరుపక్షాలు న్యాయస్థానాలను ఆశ్రయిం చి పోరాటాలు చేసు కుంటున్నాయని వాటికి సంబంధించి పరిష్కారం



చేయాలని విరుపక్షాలు స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యను ఆశ్రయించుడం జరిగిందని అనవసరంగా కోర్టుల చుట్టూ తిరిగి సమయం డబ్బు వృధా చేసుకో కుండా ఇరువురు పెద్దల సమక్షంలో కూర్చొని పరిష్కారం చేసుకోవాలని ఎమ్మెల్యే వారిని సూచించారని ఈ విషయంలో ఎమ్మెల్యే పాత్ర అంతేనని అంతకుమించి ఏమీ లేదని ఆయన తెలిపారు అనవసరంగా భూ వివాదాలను రాజకీయం చేస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న ధర్నాలు అర్థం లేనివని ఆరోపణల్లో నిజం లేదని ఆయన అన్నారు సమావేశంలో పెదకాకాని గ్రామ సర్పంచ్ స్వరూపారాణి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాగంటి మురళీకృష్ణ వైకాపా నాయకులు ఆలపాటి రాఘవ బందెల ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.... ముగ్గురు మృతి



గుంటూరు క్రైం, మేజర్ న్యూస్: గుంటూరు నగర శివారు ఏటుకూరు సమీపంలో గురువారం అర్థరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కును ఢీ కొట్టింది. సంఘటనలో మూడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరొక ముగ్గురు తీవ్ర గాయాలతో బయట పడ్డారు. మృతులు గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంత వాసులు. శుభకార్యం నుంచి సంతోషంగా ఇంటికి వెళ్లుతున్నముగ్గురిని విధి రోడ్డు ప్రమాద రూపంలో కాటేసింది. గుంటూరు నగరంలోని ఏటుకూరు బైపాస్ సమీపంలో గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ట్రాక్టర్ను కారు ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మృతులు గార్లపాటి సుబ్బమ్మ (45), గార్లపాటి పావని (18), గార్లపాటి శ్యామ్ దీక్షిత్ (6)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన గార్లపాటి నాగలక్ష్మి, డ్రైవర్ శ్రీకాంత్లు జీజీహెచ్లో చికిత్స పొందుతున్నారు. రాధా అనే మహిళ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతులు, బాధితులంతా కూడా మంగళగిరికి చెందిన వారే. పిడుగురాళ్లలో వివాహానికి హాజరై తిరిగి ఇంటికి వస్తుండగా ఏటుకూరు బైపాస్ వద్ద ప్రమాదం జరిగింది. విషయం తెలిసిన వెంటనే సౌత్ డీఎస్పి మహబూబ్ బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించామని సౌత్ డీఎస్పీ విలేకరులకు తెలిపారు. నల్లపాడు స్టేషన్ సీఐ రాంబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

# తెనాలిలో వెబ్ సీరీస్ షూటింగ్ ప్రారంభం

తెనాలి,మేజర్ న్యూస్: శ్రీశ్రీ మీడియా బ్యానర్ పై మునిపల్లి శ్రీకాంత్ నిర్మాతగా ప్రొడక్షన్ నంబర్ వన్ గా అహనా పెళ్ళంట అనే వెబ్ సీరీస్ షూటింగ్ స్థానిక నాజరు పేటలో శుక్రవారం ఉదయం ప్రారంభమైనది. దర్శకుడు కనపర్తి రత్నాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి నటీనటులపై క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు.చిత్ర దర్శకుడు దోనేపూడి వెంకీ రావణ్ మాట్లాడుతూ ప్రేమ, వినోదంతో కూడుకున్న కథతో ఈ



వెబ్ సిరీస్ ప్రేక్షకులను అలరిస్తుందని చెప్పారు. నిర్మాత శ్రీకాంత్ మాట్లాడుతూ యువత లోని సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు తనవంతుగా సహకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హీరోయిన్ నేగా నటిస్తున్న రేఖ,హీరో కళ్యాణ్,శివ,నటులు శేఖర్, సి.హెచ్ కో డైరెక్టర్ అరుణ్, సహాయ దర్శకులు వి.ముకేష్,ఎడిటర్ వై.రాజు, రచయత కుమార్ కె.డిఓపి రమేష్, మేకప్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

# బాధితులకు డా. పెమ్మసాని ఆర్థిక సాయం



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : జరిగిన రోడ్డు ప్రమాదంపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పందించారని, లోకేష్, టీడీపీ తరపున మృతుల కుటుంబాలను తాను పరామర్శించానని టిడిపి నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మృతులకు, గాయాల పాలైన వారికి తమ వంతు ఆర్థిక సాయం అందించామని, అవసరాన్ని బట్టి మరే ఇతర సాయానికైనా సిద్ధంగా ఉన్నామని పెమ్మసాని తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తక్కెళ్లపాడు సమీపంలో గురువారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఇద్దరికీ తీవ్రంగా గాయాలవ్వగా, మరొకరు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. కాగా ప్రమాదం గురించి తెలిసిన వెంటనే స్థానిక జీజీహెచ్ కు వెళ్లిన పెమ్మసాని, బాధితులను పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో మంగళగిరి కి చెందిన గార్లపాటి వెంకటసుబ్బమ్మ (45), గార్లపాటి శ్యామ్ దీక్షిత్ (6), గార్లపాటి పావని (19) అక్కడికక్కడే మృతి చెందగా, ఏకల లక్ష్మణ్ శ్రీకాంత్(29), గార్లపాటి నాగలక్ష్మి (39) తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయిన ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున ముగ్గురికి రూ. 1.50 లక్షలు, గాయపడ్డ వారిలో ఒక్కొక్కరికి రూ. 25 వేలు చొప్పున రూ. 75 వేలను వెరసి రూ. 2.25 లక్షలను డా. పెమ్మసాని ఆర్థిక సాయంగా అందించారు.

# పసుపు రైతులు రిలే నిరాహార దీక్షలు



దుగ్గిరాల, మేజర్ న్యూస్ : దుగ్గిరాల రైలు పేటలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం జరిగి 41 రోజులు గడుస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట పసుపు రైతులు రిలే నిరాహార దీక్షలు. చేపట్టారు .కోల్డ్ స్టోరేజీలో. పసుపు పంట నిల్వ చేసుకున్న రైతులకు తగిన న్యాయం చేసి ఆదుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రైతు రిలే నిరాహార దీక్షకి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కె. ఎస్. లక్ష్మణరావు హాజరై రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ముందుగా తాసిల్దార్ కార్యాలయం బయట కోల్డ్ స్టోరేజ్ ,మార్కెట్ యార్డ్ ద్వారా విడుదల చేసిన రైతుల పేర్లను పరిశీలించారు .ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దుగ్గిరాల రైలు పేటలో నీ కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగి 40 రోజులు గడిచిపోయిందని రాష్ట్ర ప్రభుత్వం అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. కోల్డ్ స్టోరేజ్ వలన వందలాదిమంది రైతులు నష్టపోయారని. లక్ష్మణ్ రావు అన్నారు. ప్రమాదం జరిగిన ప్రభుత్వం అధికారులు భీమా కంపెనీకి సంబంధించిన అధికారులు ఎవరో ఇప్పటివరకి స్పందించలేని పరిస్థితి ఏర్పడింద అన్నారు .విచారణ పేరుతో తెనాలి సబ్ కలెక్టర్ ద్వారా కమిటీ వేసి చేతులు దులుపుకున్నారన్నారు. నష్టపోయిన రైతులందర. కూ క్వింటాకు 13,000వెలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న విపత్తుల నిధుల నుంచి వెంటనే చెల్లింపులు జరపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతోనే కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర పసుపు రైతుల కన్వీనర్ జొన్న శివశంకర్ మాట్లాడుతూ జనవరి 19న అగ్నిప్రమాదం జరిగి ఇప్పటికి 40 రోజులు పూర్తయిందని రైతు సంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేయడం జరిగిందన్నారు .నష్టపోయిన రైతులకు ప్రస్తుత ధర ప్రకారం 13000 రూపా యలు చెల్లించే రైతులు ఆదుకోవాలని అన్నారు. విచారణ కమిటీ చేసిన జాబితా విడు దలను చూపించాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రెండు జాబితాలు అర్థం కాని పరిస్థితిలో ఉందన్నారు .ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ప్రధాన రహదారులను రైతులతో కలిసి దిగ్బంధం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పటాపంచల జమల య్య ,రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె .అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు మొలక శివ సామి రెడ్డి ,రైతు సంఘం నాయకులు వేములపల్లి వెంకటరామయ్య, కాజా వెంకటేశ్వరరావు ,జెట్టి. బాలరాజు ,సిపిఐ లిబరేషన్ పార్టీ కమిటీ సభ్యులు లో కం భాస్కరరావు ,యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు ,కొల్లూరి భారతీదేవి ,కాట్రగడ్డ శివరామకృష్ణయ్య ,కొండూరు కోటయ్య ,చొక్కాకుల పోతరాజు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కేంద్రాల పరిధిలో గ్రామ సభలు



పొన్నూరు మేజర్ న్యూస్ : 2023-24 రబీ సీజన్ కుగాను పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలోని పొన్నూరు, చేబ్రోలు మరియు కాకుమాను మండలాల్లో 44,972 ఎకరాలలో సాగుకాబడిన అన్నీ రకాల పంటలను ఈ - క్రాప్ లో నమోదు ప్రక్రియ 29 .02.2024 పూర్తి చేయడం జరిగినదని పొన్నూరుసహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్) వి. రామకోటేశ్వరి తెలిపారు. మూడు మండలాల్లో అన్నీ రైతు భరోసా కేంద్రాల వద్ద 01.03.2024 వ తేదీ నుండి 03.03. 2024 వరకు ఈ -క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించబడుతుందని, రైతు భరోసా కేంద్రాల పరిధిలో గ్రామ సభలు కూడా నిర్వహించబడతాయి. ఈ గ్రామసభలలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో ఉన్న అనగా ఈ - క్రాప్ లో నమోదు కాబడిన అన్నీ వివరాలను సమగ్రంగా చదివి వినిపించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కావున రైతు సోదరులు మీ రైతు భరోసా కేంద్రం లో సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించబడుచున్న రబీ 2023-24 పంట నమోదు ముసాయిదా జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే సవరణ కొరకు మీ రైతు భరోసా కేంద్రంలో ఉన్న రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించి అభ్యంతరాలను వ్రాతపూర్వకంగా తెలియచేయవలసిందిగా ఆమె కోరారు .ఈ %-- % క్రాప్ రబీ 2023-24 సీజన్ పంటనమోదులో సవరణ కొరకు ఇది ఆఖరి అవకాశం, తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు మరియు చేర్పులు చేయబడవని ఆమె తెలిపారు.

## రాజధాని రైతు కూలీలకు 5000 రూపాయల పెన్షన్ అందజేత



తుళ్లూరు మేజర్ న్యూస్ : రాజధాని ప్రాంతంలోని రైతు కూలీలకు అందించే పెన్షన్ పెంపు కార్యక్రమానికి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త పత్తిపాడు ఎమ్మెల్యే మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత విచ్చేశారు శుక్రవారం తుళ్లూరు అయ్యప్ప స్వామి గుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా మేకతోటి సుచరిత హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రాజధాని రైతు కూలీలకు పేదలకు అందించే 2500 రూపాయల పెన్షన్ 5000 రూపాయలకు పెంచిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందన్నారు పేదల పక్షాన మహిళల పక్షాన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్నాడని సుచరిత అన్నారు పేదవాడి కన్నీటి విలువ తెలిసిన మహనీయుడు సీఎం జగన్మోహన్ రెడ్డిని ఆమె కొనియాడారు రానున్న ఎన్నికలలో సీఎం జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండాలని సూచరిత పిలుపునిచ్చారు రాజధాని ప్రాంతమైన అమరావతి లో భారీ మెజారిటీ సాధించే దిశగా మహిళలు సీఎం జగన్మోహన్ రెడ్డికి తోడుగా నిలవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎండిఓ శివన్నారాయణ నియోజకవర్గం పరిశీలకులు బి బ్రహ్మానంద రెడ్డి గ్రామ వైసిపి అధ్యక్షుడు ఆలోకం సురేష్ సొసైటీ అధ్యక్షులు నాయుడు నాగేశ్వరరావు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బి శివ రెడ్డి శృంగారపాటి సందీప్ టి రమణారెడ్డి బత్తుల కిషోర్ మండల లోని వైసిపి సీనియర్ నేతలు కార్యకర్తలు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు

# విట్ యూనివర్సిటీలో ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు సమావేశం

తుళ్లూరు మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు 6వ సమావేశం నిర్వహిస్తున్నట్లు హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ కె హేమచంద్ర రెడ్డి పేర్కొన్నారు ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారుఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ యొక్క ఆరవ సమావేశం 3 మరియు 4 మార్చ్ 2024 తేదీల్లో విఐటి - ఏపి విశ్వవిద్యాలయంలోనిర్వహిస్తున్నారు ఈ సమావేశం యొక్క థీమ్ 'విశ్వవిద్యాలయాల్లో వైబ్రెంట్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను పెంపొందించడం'. విఐటి - ఏపి విశ్వవిద్యాలయం, రాష్ట్రంలో ఇటువంటి సమావేశాన్ని నిర్వహించే గౌరవాన్ని పొందిన మొదటి ప్రైవేట్ విశ్వవిద్యాలయంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ చైర్మన్, ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి ఈ సమావేశాన్ని ప్రారంభిస్తారు. అనంతరం డాక్టర్ ఎస్.వి. కోటా రెడ్డి (వైస్ ఛాన్సలర్, విఐటి - ఏపి విశ్వవిద్యాలయం) తన సందేశాన్ని అందిస్తారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా జె. శ్యామలరావు, IAS (ప్రిన్సిపాల్ సెక్రటరీ - ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం) మరియు డా ఎం బుద్ధ చంద్రశేఖర్ (చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్, AICTE), విశిష్ట అతిథిగా బొత్స సత్యనారాయణ (విద్యాశాఖ మంత్రి, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం) మరియు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ టి.జి. సీతారాం (చైర్మన్, AICTE) హాజరవుతారు. అంతేకాకుండా విఐటి వ్యవస్థాపకుడు మరియు ఛాన్సలర్ అయిన జి. విశ్వనాథన్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు.రాష్ట్రంలోని అన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు చెందిన వైస్ ఛాన్సలర్లు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొల్పబడిన కేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. థీమ్‌పై చర్చ 5 సెషన్‌లలో జరుగుతుంది మరియు చర్చల ఆధారంగా విశ్వవిద్యాలయాలలో పరిశోధన మరియు ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడానికి విధాన పత్రం తయారు చేయబడుతుంది.

## పోలీసుల సంక్షేమం కోసం పోలీస్ గ్రీవెన్స్ డే : ఎస్పీ



గుంటూరు మేజర్ న్యూస్ : పోలీసుల సంక్షేమం కోసం 'పోలీస్ గ్రీవెన్స్ డే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించారు.

## ప్రాంగణ ఎంపికల్లో కళ్ళం విద్యార్థి సత్తా



గుంటూరు రూరల్, మేజర్ న్యూస్: గుంటూరు నగర శివారు చౌడవరం కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల్లో బీటెక్ సి ఎస్ ఈ చివరి సంవత్సరం చదువుతున్న ఈదర నాగార్జున ప్రాంగణ ఎంపికల్లో సత్తా చాటాడు. ప్రముఖ సాఫ్ట్వేర్ సంస్థ ఎఫెక్ట్రానిక్స్ లో ఉద్యోగం సంపాదించాడు. అతని వార్షిక వేతనం రూ. 5.30 లక్షలు గా సంస్థ నిర్ణయించినట్లు కళాశాల డైరెక్టర్ ఎం ఉమా శంకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జునను డైరెక్టర్ తో పాటుగా ప్రిన్సిపాల్ బి ఎస్ బి రెడ్డి, ఉపాధి కల్పనా అధికారి మాధవరావు అభినందించారు.